
సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కోటగిరి వేంకట పాపారావు జ్ఞాపకార్థం ఆయన భార్య రత్నకుమారి (భువనగిరి) మంగళవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,100 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
42.0° / 25.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.0	25.0
కాకినాడ	39.5	26.5
అమలాపురం	39.0	26.0

న్యూస్‌రీల్

ప్రచార ప్రకటనలకు అనుమతి తప్పనిసరి



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజకీయ పార్టీలు, పోటీలో నిలిచే అభ్యర్థులు తమ ప్రచార ప్రకటనలు, వీడియోలకు జిల్లా మీడియా సమన్వయ పర్యవేక్షణ కమిటీ ద్వారా తప్పనిసరిగా ఆమోదం పొందాలని జిల్లా **ఎన్నికల అధికారి**, కలెక్టర్ కె.మాధవీలత మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వీడియో వాహనాల్లో వీడియో క్లిప్పింగ్‌ల ప్రచారానికి కూడా ముందస్తు అనుమతి తప్పనిసరని, ఆ వివరాలు కూడా వీడియోలో చూపాలని తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాలు, సినిమా థియేటర్లు, లోకల్ చానళ్లు, శాటిలైట్ చానళ్ల వంటి వాటిలో ప్రచారానికి కచ్చితంగా ముందస్తు అనుమతి తీసుకోవాలని వివరించారు. అనుమతి లేకుండా ప్రచారం నిర్వహిస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనగా పరిగణిస్తామన్నారు. సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో వస్తున్న అనుకూల వార్తలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని పేర్కొన్నారు. ఆయా కథనాలపై సంబంధిత అభ్యర్థుల ఈ–మెయిల్ ఐడీకి, ఫోన్లకు వ్యక్తిగతంగా నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. వాటిపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. నామినేషన్లు దాఖలు చేస్తున్న క్రమంలో ఈ అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని, అయినప్పటికీ కొందరు ముందస్తు అనుమతి పొందడం లేదని, వారిపై సంబంధిత రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ మాధవీలత తెలిపారు.

లోక్ అదాలత్ వాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి మాధురి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సార్వత్రిక ఎన్నికలు, ఇతర కారణాలతో వచ్చే నెల 11న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను జూన్ 29వ తేదీకి వాయిదా వేశారని తొమ్మిదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వివిధ బీమా సంస్థల ప్రతినిధులు, ఆ సంస్థల న్యాయవాదులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో మోటార్ వాహనాల ప్రమాద కేసులను అధిక మొత్తంలో పరిష్కరించేందుకు, బాధితులకు తగు పరిహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాదాల కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని మాధురి ఆదేశించారు. సమావేశంలో ఫ్లాపస్ చైర్మన్ ఎ.గాయత్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల శ్రీచక్రస్నానం



సీతారాముల విగ్రహాలకు, శ్రీచక్రానికి పుణ్యస్నానం చేయిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై నిర్వహిస్తున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజైన మంగళవారం పంపా నదిలో సీతారాముల శ్రీచక్ర స్నాన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారు వెంట రాగా పల్లకిపై నవదంపతులు సీతారాములను పంపా తీరానికి ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ వేదికపై ఏర్పాటు చేసిన రెండు సింహాసనాలపై సీతారాములను, సత్యదేవుడు, అమ్మవారిని వేంచేయించి పూజలు చేశారు. అనంతరం సీతారాములకు, శ్రీచక్రానికి పండితులు అవభృథ స్నానం నిర్వహించారు. ఆ తరువాత సీతారాముల విగ్రహాలను శ్రీచక్రాన్ని వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా పంపా నదికి తీసుకుని వెళ్లి, శ్రీచక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తిరిగి సీతారాములను సింహాసనంపై వేంచేయించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు దేవులపల్లి ప్రసాద్, సుధీర్, పరిచారకులు పవన్ వ్రత పురోహితులు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి తదితరులు వైదిక కార్యక్రమాలు చేయించారు. సాయంత్రం 4 గంటలకు రత్నగిరి రామాలయంలో సీతారాములకు నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి రామాలయంలో సీతారాములకు శ్రీపుష్ప యాగ మహోత్సవం నిర్వహించనున్నారు.

అనపర్తిలో అయోమయం

- భార్యతో తన నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి కృష్ణంరాజు
- ఆయనను తప్పించేందుకు పురందేశ్వరి యత్నాలు
- నామినేషన్ వేయవద్దని వార్నింగ్!
- తన విజయం కోసం ఆ సీటు నల్లమిల్లికి కట్టబెట్టేందుకు వ్యూహం
- బీజేపీ పేరుతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి సతీమణి నామినేషన్
- నేడో రేపో ఆ పార్టీ తీర్థం పుచ్చుకోనున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తి బీజేపీ అభ్యర్థి శివరామ కృష్ణంరాజు తరఫున సోమవారం నామినేషన్ వేస్తున్న ఆయన భార్య దుర్గా దేవిక



అనపర్తి బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తరఫున నామినేషన్ వేస్తున్న తేతలి అబ్బుస్‌రెడ్డి

సాక్షి, రాజమహేంద్రవరం: అనపర్తి అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి వ్యవహారం రోజురోజుకూ ఉత్కంఠ రేపుతోంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై ముగింపు దశకు చేరుకుంటున్నా ఎన్నికల బరిలోకి ఎవరు దిగుతారనే విషయంపై సస్పెన్స్ వీడటం లేదు. ఫలితంగా బీజేపీ, టీడీపీ నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా సీటు తమకంటే తమకంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ పరిణామం ఆయా పార్టీల శ్రేణుల్లో గందరగోళం రేపుతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి స్వప్రయోజనాల కోసం, మరిది చంద్రబాబుకు మంచి చేసేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాల్లో టీడీపీ, బీజేపీ నేతలు నలిగిపోతున్నారు.

చంద్రబాబు వ్యూహంతో..

అనపర్తి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును టీడీపీ తొలుత ప్రకటించింది. అనంతరం కుదిరిన పొత్తుల్లో ఈ సీటును బీజేపీకి వదిలేసింది. దీంతో హతాశులైన నల్లమిల్లి వర్గీయులు తీవ్ర స్థాయిలో ఆందోళన చేశారు. చంద్రబాబు దిగి రాకపోవడంతో రామకృష్ణారెడ్డి రెబల్‌గా బరిలోకి దిగి, ప్రచారం చేసుకుంటున్నారు. ఈలోగా ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా మాజీ సైనికుడు ములగపాటి శివరామ కృష్ణంరాజు పేరును ఆ పార్టీ ప్రకటించింది. ఈ క్రమంలో ఆయన విపక్ష కూటమి అభ్యర్థిగా బీజేపీతో పాటు టీడీపీ, జనసేన కండువాలు వేసుకుని ప్రచారం చేసుకుంటూంటే టీడీపీ నేతలు బిక్కవోలులో అడ్డుకున్నారు. టీడీపీ కండువాలతో ప్రచారం చేయడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. ఇదిలా ఉండగా.. తదనంతర పరిణామాల్లో చంద్రబాబు వ్యూహం మేరకు బీజేపీ అభ్యర్థిగా శివరామ కృష్ణంరాజును తప్పించి, టీడీపీ నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కమలం పార్టీ అధికారిక అభ్యర్థిగా ప్రకటించేందుకు పురందేశ్వరి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనపర్తిలో బీజేపీ అభ్యర్థి ఎవరనే అంశంపై సస్పెన్స్ ఏర్పడింది. దీనిపై బీజేపీ అధిష్టానం ఇప్పటి వరకూ స్పష్టత ఇవ్వలేదు.

పోటాపోటీగా నామినేషన్లు

నామినేషన్ల దాఖలుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే తరువాత చూద్దాంలే అనే భావనతో ఎవరికి వారు ఇప్పటికే నామినేషన్లు వేస్తున్నారు. తొలుత మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భార్య మహాలక్ష్మి టీడీపీ తరఫున ఒక సెట్ నామినేషన్ వేశారు. బీజేపీ నుంచి తానే ఎన్నికల బరిలోకి దిగుతానని సంకేతాలు ఇచ్చేలా ఆ పార్టీ అభ్యర్థి శివరామ కృష్ణంరాజు తరఫున ఆయన భార్య దుర్గా దేవిక నామినేషన్ దాఖలు చేసి అందరినీ షాక్‌కు గురి చేశారు. ఒకవైపు సీటుపై నెలకొన్న పీటముడి వీడకముందే బీజేపీ తరఫున నామినేషన్ దాఖలు కావడంతో దీనిని బీజేపీకే కట్టబెడతారేమోననే ఆందోళనతో నల్లమిల్లి వర్గం పునరాలోచనలో పడింది. ముందు జాగ్రత్తగా రామకృష్ణారెడ్డి తరఫున తేతలి అబ్బుస్‌రెడ్డి కూడా బీజేపీ అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ వేశారు. ఈ పరిణామం బీజేపీ నేతల్లో మరింతగా అగ్గి రాజేస్తోంది. పార్టీలో చేరకుండానే బీజేపీ అభ్యర్థిగా ఎలా నామినేషన్ వేస్తారంటూ కమలనాథులు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా పురందేశ్వరి మౌనంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ గూటికి నల్లమిల్లి?

తాజా పరిణామాల్లో అనపర్తిలో సరికొత్త రాజకీయానికి తెర లేస్తోంది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి వ్యూహాత్మకంగా ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కమలం గూటికి చేరుకోనున్నారు. పార్టీ తీర్థం పుచ్చుకునే ప్రక్రియ లాంఛనమన్న సంకేతాలు టీడీపీ నేతల నుంచే వెలువడుతున్నాయి. ఈ విషయాన్ని నేడో రేపో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. చంద్రబాబు, పురందేశ్వరి డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారం జరుగుతున్నట్లు కమలనాథులే చెబుతున్నారు. కమలం గుర్తు పైనే అనపర్తి బరిలో నల్లమిల్లి పోటీ చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఆయన బీజేపీ అభ్యర్థిగా తన తరఫున వేరే వ్యక్తితో నామినేషన్ వేయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బీజేపీ బీఫామ్ సైతం తనకే దక్కుతుందన్న ధీమా నల్లమిల్లిలో కనిపిస్తోంది.

సెంటిమెంటుతోనేనా..

అనపర్తిపై పురందేశ్వరి ఇంతగా పట్టు పట్టడానికి ఈ నియోజకవర్గ సెంటిమెంటే కారణమని చెబుతున్నారు. అనపర్తి నియోజకవర్గ ప్రజలు ఏ పార్టీకి ఓటు వేయాలని భావిస్తే.. ఏక మొత్తంగా అదే పార్టీకి పట్టం కడతారు. ఆ పార్టీకి భారీ మెజార్టీ అందిస్తారన్న ఖ్యాతి మూటగట్టుకున్నారు. ఏ పార్టీకి మొగ్గు చూపినా 50 వేలకు పైగా మెజార్టీ ఇచ్చేస్తారు. గత ఎన్నికల గణాంకాలే దీనికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. 2009లో రాజమండ్రి నుంచి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా మురళీ మోహన్ పోటీ చేశారు. ఈ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆయనకు 50 వేల మెజార్టీ దక్కింది. కేవలం అనపర్తిలో మాత్రమే భంగపాటు ఎదురైంది. ఆ ఎన్నికల్లో అనపర్తి ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో ఆ పార్టీ అభ్యర్థి ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు ఒక్క ఈ నియోజకవర్గం నుంచే 60 వేల ఓట్ల మెజార్టీ లభించింది. అనపర్తి దెబ్బకు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ 10 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ పరిణామం పునరావృతం కాకుండా, తాను గెలవాలంటే నల్లమిల్లిని బీజేపీ నుంచి పోటీ చేయించాలన్నది చిన్నమ్మ ఆకాంక్ష. అందుకోసమే తీవ్ర విమర్శలు వస్తున్నా లెక్క చేయకుండా పురందేశ్వరి అభ్యర్థి మార్పుపై పట్టుబడుతున్నారని అంటున్నారు.

నల్లమిల్లికే చిన్నమ్మ ఆశీస్సులు!

రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చిన్నమ్మ పురందేశ్వరి.. తన ప్రయోజనాల కోసం, మరిది, టీడీపీ అధినేత చంద్రబాబు మేలు కోసం సొంత పార్టీకి నమ్మకద్రోహం చేసేందుకు సైతం వెనుకాడటం లేదనే విమర్శలు వస్తున్నాయి. బీజేపీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థి కృష్ణంరాజును కాదని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లికి ఆమె అండగా నిలుస్తున్నారని చెబుతున్నారు. ఎలాగైనా నల్లమిల్లిని బీజేపీ నుంచి అనపర్తి ఎమ్మెల్యేగా పోటీ చేయించేందుకు ఆమె తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే మాజీ సైనికుడు, కృష్ణంరాజును పోటీ నుంచి తప్పుకోవాల్సిందిగా ఆమె అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. రాష్ట్ర అధ్యక్షురాలి ఆదేశాలను పట్టించుకోని కృష్ణంరాజు తన భార్యతో నామినేషన్ దాఖలు చేయించారని తెలిసింది.

మాజీ సైనికుడికి అన్యాయం?

అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించిన శివరామ కృష్ణంరాజు ఆ పార్టీకి వీర విధేయుడు. ఆయనది ఆర్ఎస్ఎస్ కుటుంబం. తండ్రి బీజేపీ బలోపేతానికి పాటు పడ్డారు. తన తండ్రి వైద్యం కోసం ఆర్మీ నుంచి వలంటరీ రిటైర్మెంట్ తీసుకుని వచ్చిన కృష్ణంరాజు బీజేపీలో క్రియాశీలక కార్యకర్తగా పేరు సంపాదించారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు నాలుగేళ్లుగా అహర్నిశలూ కష్టపడ్డారు. ఏడాది నుంచి బీజేపీ అనపర్తి నియోజకవర్గ కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. ఈ మాజీ సైనికుడిని గుర్తించిన బీజేపీ కేంద్ర పెద్దలు అనపర్తి సీటు కేటాయించారు. ఈ పరిణామం పురందేశ్వరికి మింగుడు పడని అంశంగా మారింది. **స్వపక్ష అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సింది పోయి.. చంద్రబాబు డైరెక్షన్‌లో టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లికి అండగా నిలవడం ప్రారంభించారు. అనపర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లో లోక్‌సభ ఓట్లు తనకు రావాలంటే అక్కడ ఎమ్మెల్యే అభ్యర్థిగా** నల్లమిల్లి ఉండాలని భావించారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు బీజేపీ సీటు ఇప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం చివరకు అధిష్టాన నిర్ణయాన్ని సైతం ధిక్కరించేందుకు సిద్ధపడుతున్నారు. పురందేశ్వరి వ్యవహార శైలి కమలనాథులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సీనియర్ నేత సోము వీర్రాజు బీజేపీకి దూరమయ్యే పరిస్థితి తలెత్తింది.

ఆర్యవైశ్యులకు బాబు అన్యాయమే చేశారు

- ఈ ఎన్నికల్లో ఆయన్ను నమ్మి ఓట్లు వేస్తే గోతిలో పడినట్టే
- సంఘ ఆత్మీయ సమావేశంలో శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం

మండపేట: ఆర్యవైశ్యులకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తీరని ద్రోహం చేశారని, ఆయన్ను నమ్మి టీడీపీకి ఓట్లు వేస్తే మన గొయ్యిని మనమే తవ్వుకున్నట్టు అవుతుందని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. మండపేటలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. శ్రీ కన్యకా పరమేశ్వరీ కల్యాణ మంటపంలో సంఘ అధ్యక్షుడు బోనగిరి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శివరామ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రెడ్డి రాజబాబు, వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు, తనకు మూడు దశాబ్దాల సాన్నిహిత్యం ఉందన్నారు. ఆయన కుటుంబంతో ఎప్పటి నుంచో తనకు సత్సంబంధాలున్నాయని చెప్పారు. ఆర్యవైశ్యులు ఎక్కువగా వ్యాపార రంగాల్లో స్థిరపడి ఉంటారని, ఆయా సందర్భాల్లో వ్యాపారులపై అధికారులు జులుం ప్రదర్శించినప్పుడు తనకు మొదట గుర్తుకు వచ్చేది ఎమ్మెల్సీ త్రిమూర్తులేనని చెప్పారు. ఆర్యవైశ్యులకు ఆయన అందించిన సహాయ సహకారాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. అటువంటి మంచి నాయకుణ్ని పట్టుకొని ఇటీవల జరిగిన ఆర్యవైశ్య సమావేశంలో ఓ చిన్న కుర్రాడు విమర్శిస్తే తనకు బాధ కలిగిందన్నారు. మండపేట ఆర్యవైశ్యులు మంచి మనసున్న వారని, అటువంటి వ్యక్తుల మధ్య విభేదాలు సృష్టించాలని చేస్తున్న ప్రయత్నాలకు మోసపోవద్దని అన్నారు.

సీఎం జగన్ ఆర్యవైశ్యులను గౌరవించారు

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆర్యవైశ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎందుకు ఓటు వేయాలనే అంశాలను ఆయన వివరించారు. ఆర్యవైశ్యులకు మూడు కార్పొరేషన్ పదవులు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఆర్యవైశ్యుల్లో ముగ్గురికి ఎమ్మెల్యే సీట్లు ఇచ్చిన చరిత్ర ఆయనది అని చెప్పారు. ఆర్యవైశ్యులకు మేలు చేకూరే మూడు జీవోలను సీఎం జగన్ అమలు చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతి నాడే ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం అని ప్రకటించిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. చింతామణి నాటకంలోని ఓ పాత్ర ఆర్యవైశ్యులను చులకన చేస్తూ ఉందని, ఆ నాటకాన్ని రద్దు చేయాలని కోరితే చంద్రబాబు మనసు అంగీకరించలేదన్నారు. సీఎం జగన్ చింతామణి నాటక ప్రదర్శనను రాష్ట్రంలో నిషేధిస్తూ జీవో అమలు చేసి, ఆర్యవైశ్యుల గౌరవాన్ని నిలబెట్టారని కొనియాడారు. దేవదాయ శాఖ నుంచి ఆర్యవైశ్య సత్రాలు, ఆలయాలను సీఎం జగన్ తప్పించి జీవో అమలు చేశారన్నారు. చంద్రబాబు 15 ఏళ్లు సీఎంగా ఉండి ఆర్యవైశ్యులకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. ఆర్యవైశ్యుల్లో ఉన్న పేదలను గుర్తించి వారి సంక్షేమం కోసం సీఎం జగన్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు తెలియజేసి మండపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని శ్రీఘాకోళ్లపు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానని భరోసా ఇచ్చారు. అనంతరం సుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఘనంగా సత్కరించారు. కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ, ప్రముఖ పారిశ్రామికవేత్త కాంతేటి కాశీ, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం

లోక్‌సభకు 4.. అసెంబ్లీ స్థానాలకు 25

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో మంగళవారం లోక్‌సభకు 4, అసెంబ్లీ నియోజకవర్గాలకు 25 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు వేసిన ప్రముఖుల్లో రాజమండ్రి సిటీ నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ తరఫున మార్గాని సురేష్, టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ తరఫున వీర రాఘవమ్మ, అనపర్తిలో బీజేపీ నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తరఫున తేతలి అబ్బుస్‌రెడ్డి, నిడదవోలు నుంచి జనసేన అభ్యర్థి కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ తరఫున ప్రశాంత్ శ్రీనివాస్ తదితరులున్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన ఈ నెల 18 నుంచి ఇప్పటి వరకూ రాజమండ్రి లోక్‌సభ స్థానానికి 9 నామినేషన్లు దాఖలయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అనపర్తి 8, రాజానగరం 11, రాజమండ్రి సిటీ 11, రాజమండ్రి రూరల్ 9, కొవ్వూరు 15, నిడదవోలు 11, గోపాలపురం 8 కలిపి మొత్తం 73 నామినేషన్లు దాఖలయ్యాయి.

శ్రీనివాసా.. గోవిందా..!

ఇచ్చిన సీటుకూ దేశం పోటు!

- టీ టైమ్ అధినేతకు ఎంపీ టికెట్టు.. పవన్‌కు తలపోటు
- ఉదయ్ శ్రీనివాస్‌ను తప్పించేందుకు టీడీపీ వ్యూహం
- ఆయనను మార్చాలని ఎమ్మెల్యే అభ్యర్థుల పట్టు
- సానా సతీష్‌ను తీసుకుని వచ్చేందుకు ప్రయత్నాలు
- అంతా చంద్రబాబు వ్యూహమేనని ప్రచారం





సాక్షి ప్రతినిధి, కాకినాడ: తలపోటుగా ఉన్నప్పుడు ఓ కప్పు స్ట్రాంగ్ టీ తాగితే ఉపశమనం కలుగుతుందంటారు. ఆ టీలో అల్లం వేసుకుంటే మరింత రుచికరంగా, తలపోటుకు తక్షణ పరిష్కారంగా ఉంటుంది. అటువంటి టీ తాగినా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు తలపోటు ఎక్కువైపోతోందే తప్ప తగ్గడం లేదనే చర్చ కాకినాడ జిల్లా జనసేన సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. టీ టైమ్ అవుట్‌లెట్‌లతో తనకు అత్యంత సన్నిహితుడైన తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఏరికోరి మరీ కాకినాడ ఎంపీ అభ్యర్థిని చేశారు పవన్ కల్యాణ్. ఇప్పుడా అభ్యర్థిత్వమే పవన్‌కు పెద్ద తలపోటుగా మారింది.

ఊరించి ఊరించి.. శ్రీనివాస్‌కు జెల్ల

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ నుంచి వారాహి యాత్ర వరకూ అన్నీ తానై చూసుకున్న శ్రీనివాస్‌కు పవన్ కల్యాణ్ తొలుత జనసేన పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ప్రమోషన్ అన్నట్టు.. పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఉదయ్ శ్రీనివాస్‌ను బరిలోకి దింపుతామని సంకేతాలు అందించారు. ఈ మేరకు శ్రీనివాస్, ఆ పార్టీ నేతలు ఆ నియోజకవర్గంలో ప్రచారం కూడా చేశారు. నాలుగు రోజులు గడిచేసరికి పవన్ కల్యాణ్ నాలుక మడత పెట్టేశారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ఓసారి.. కాదు కాదు.. కాకినాడ నుంచి ఎంపీగా పోటీ చేస్తానని రోజుకో మాట చెబుతూ పార్టీ శ్రేణులను గందరగోళంలోకి నెట్టేశారు. ఎక్కడి నుంచి పోటీ చేయాలనే అంశంపై ఆయన కూడా చాలా కాలం మీమాంసలో పడ్డారు. చివరకు పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించి శ్రీనివాస్‌కు జెల్ల కొట్టారు. అయితే, ఆ నొప్పి ఆయనకు తెలియనివ్వకుండా కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. పిఠాపురంలో అంతా టీడీపీ అధినేత చంద్రబాబు డైరెక్షన్‌లోనే జరుగుతోందని, తమను కాదని పవన్ ఇక్కడ ఏ నిర్ణయమూ తీసుకోలేరని పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ తొలి నుంచీ బాహాటంగానే చెబుతూ వచ్చారు. సరిగ్గా ఉదయ్ శ్రీనివాస్ విషయంలో అదే జరిగింది.

వ్యతిరేకిస్తున్న టీడీపీ

జనసేన నుంచి ఉదయ్ శ్రీనివాస్‌ను కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం టీడీపీ సరికొత్త రాజకీయానికి తెర తీసింది. ఆయనను ఆ స్థానంలో కూడా ఉండే అవకాశం లేకుండా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నేతలు శ్రీనివాస్‌కు పొగ పెడుతున్నారు. కాకినాడ పార్లమెంటరీ స్థానంలో పట్టుమని పది మందితో కూడా పరిచయం లేని శ్రీనివాస్‌ను ఏకంగా ఎంపీ అభ్యర్థిని చేసేయడమేమిటని టీడీపీ నేతలు, ఆ పార్టీ అభ్యర్థులు వాదన తీసుకువస్తున్నారు. పార్టీలోని సీనియర్లతో మాట వరసకైనా సంప్రదించకుండా పవన్ తీసుకున్న ఈ నిర్ణయం వారికి రుచించడం లేదు. అలాగని నేరుగా బయట పడకుండా, శ్రీనివాస్‌ను సాగనంపేందుకు చంద్రబాబు వద్ద పావులు కదుపుతున్నారు. కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పిఠాపురం, కాకినాడ రూరల్ నుంచి జనసేన పోటీ చేస్తోంది. అవి మినహా మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఉదయ్ శ్రీనివాస్‌ను మార్చాలని గట్టిగా పట్టు పడుతున్నారు.

సానా సతీష్‌కు కట్టబెట్టేందుకు..

ఉదయ్ శ్రీనివాస్ స్థానంలో టీడీపీ సానుభూతిపరుడైన సానా సతీష్‌ను తెర మీదకు తీసుకుని వచ్చేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన పేరు పరిగణనలోకి తీసుకోవాలని టీడీపీ నేతలు ఒత్తిళ్లు తీసుకుని వస్తున్నారు. అటు టీడీపీ, ఇటు జనసేనలకు సమదూరం పాటిస్తూ, చారిటబుల్ ట్రస్టు పేరుతో కాకినాడ పార్లమెంటరీ స్థానాన్ని ఆశిస్తున్న స్థానికుడైన సతీష్ పేరు పరిశీలించాలని టీడీపీ అగ్ర నేతలు ఇటీవల చంద్రబాబును కోరారు. తద్వారా ఎంపీ సీటును కూడా తమ ఖాతాలో వేసుకోవాలన్నది టీడీపీ వ్యూహంగా ఉంది.

కాకినాడ ఎంపీ సీటు ఆశించి భంగపడిన జ్యోతుల నవీన్ కుమార్ వర్గీయులు కూడా ఉదయ్ శ్రీనివాస్‌తో విభేదిస్తున్నారు. ఒక దశలో నవీన్ కుమార్ తండ్రి, జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సైతం 'సూట్‌కేసులతో వచ్చే వారికి సీట్లు ఇచ్చేస్తే.. ఇక్కడ పార్టీనే నమ్ముకుని కష్టపడి చేస్తున్న నాయకులు ఏమైపోవాలి' అంటూ బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు అప్పట్లో దుమారం రేపాయి. ఆ సమయంలోనే పవన్ పట్టుబట్టి మరీ ఉదయ్ శ్రీనివాస్‌ను ఎంపీ స్థానం నుంచి బరిలోకి దింపుతున్నట్లు ప్రకటించారు. దీనిపై టీడీపీ అభ్యర్థులు కన్నెర్ర చేస్తున్నారు. పార్లమెంటరీ అభ్యర్థిని ప్రకటించే ముందు ఆ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న వారిని సంప్రదించాలనే కనీస సంప్రదాయం కూడా పాటించలేదనే సాకుతో శ్రీనివాస్‌కు చెక్ పెట్టేందుకు టీడీపీ నేతలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ముక్కూ మొహం తెలియని ఉదయ్ శ్రీనివాస్‌ను ఏ ప్రాతిపదికన కాకినాడ ఎంపీ అభ్యర్థిని చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. తంగెళ్లకు చెక్ పెట్టేందుకు చాప కింద నీరులా టీడీపీ నేతలు చేస్తున్న ఈ ప్రయత్నాలు పవన్‌కు తలపోటుగా మారాయి.

ఖర్చులు ఇవ్వడం లేదని..

ఉదయ్ శ్రీనివాస్‌ను మార్పించేందుకు టీడీపీ అభ్యర్థులు గట్టిగా పట్టు పట్టడానికి మరో కారణం కూడా ఉంది. అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న వారికి అవుతున్న ఖర్చులు కనీసంగా భరించడానికి కూడా ఉదయ్ శ్రీనివాస్ సహకరించడం లేదని అంటున్నారు. ఇది కూడా ఆయనపై టీడీపీ నేతల వ్యతిరేకతకు కారణమని చెబుతున్నారు. తన వెనుక పవన్ ఉన్నారనే ధైర్యంతో.. మితిమీరిన విశ్వాసంతో ఉదయ్ శ్రీనివాస్ ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తున్నారని టీడీపీ అభ్యర్థులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు.

టీడీపీ ఖాతాలో వేసుకునేందుకేనా..

అయితే, ఇదంతా చంద్రబాబు వ్యూహమేనని జనసేన నాయకులు అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో తమ పార్టీకి కేటాయించిన కాకినాడ ఎంపీ స్థానాన్ని లాక్కునేందుకే ఉదయ్ శ్రీనివాస్‌పై వ్యతిరేక ప్రచారం నడుపుతున్నారని మండిపడుతున్నారు. ఏ పార్టీలోనూ చేరకుండా గోడ మీద.. సామెత చందంగా ఉన్న సతీష్‌ను ఎందుకు ప్రతిపాదిస్తున్నారని ఇటీవల జరిగిన టీడీపీ, జనసేన పార్టీల సమన్వయ సమావేశంలో ఉదయ్ శ్రీనివాస్ వర్గీయులు గట్టిగా ప్రశ్నించారని తెలిసింది. ఇదిలా ఉండగా కాకినాడ ఎంపీ బరిలో నిలిచేందుకు ఉదయ్ శ్రీనివాస్ చివరి వరకూ గట్టి ప్రయత్నాలే చేస్తున్నారని తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆయన బుధవారం నామినేషన్ వేయాలని నిర్ణయించుకున్నారు. అయితే, చివరి నిమిషం వరకూ కూడా అభ్యర్థులను తనకు నచ్చిన రీతిలో మార్చేసిన చరిత్ర టీడీపీ అధినేత చంద్రబాబుకు ఉంది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం అటు తిరిగి ఇటు తిరిగి ఏ తీరానికి చేరుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

క్లుప్తంగా

చెస్ స్టేట్ చాంపియన్‌గా సాత్విక్



చెస్ స్టేట్ చాంపియన్ షిప్‌ను అందుకుంటున్న క్రీడాకారుడు సాత్విక్

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన చెస్ క్రీడాకారుడు ద్రాక్షారపు స్వాత్విక్ స్టేట్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. విజయవాడ పోరంకిలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకూ జరిగిన చెస్ అండర్–17 స్టేట్ చాంపియన్ షిప్ పోటీల్లో సాత్విక్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి ఈ చాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్నాడు. అమలాపురంలోని విక్టరీ అకాడమీ విద్యార్థి అయిన సాత్విక్ చిన్నతనం నుంచి చెస్ క్రీడలో రాణిస్తూ ఎప్పటికప్పుడు ప్రతిభ కనబరుస్తున్నాడని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ తెలిపారు. సాత్విక్ చెస్ ప్రతిభ జిల్లాకే గర్వ కారణమని ఆయన పేర్కొన్నారు. వచ్చే నెలలో చండీఘర్‌లో జరగనున్న ఆలిండియా అండర్–17 చెస్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో సాత్విక్ మన రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడని సురేష్ తెలిపారు. ఈ నెల 17న అమలాపురంలో జరిగిన జిల్లా స్థాయి అండర్–17 చెస్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించిన సాత్విక్ విజయవాడ పోరంకిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రవ్యాప్తంగా 150 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో సాత్విక్ ప్రథమస్థానంలో నిలిచాడు.

నదిలో జారిపడి విద్యార్థి మృతి



యండ్రు మురళీకృష్ణ (ఫైల్)

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరి నదిలో కపిలేశ్వరపురం వద్ద ప్రమాదవశాత్తూ జారిపడి మండపేటకు చెందిన యువకుడు మృతిచెందాడు. అంగర ఎస్సై అందె పరదేశి తెలిపిన వివరాల ప్రకారం... మండపేటకు చెందిన యండ్రు మురళీకృష్ణ (20), మరో నలుగురు కపిలేశ్వరపురం వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగారు. మంగళవారం జరిగిన ఘటనలో మురళీకృష్ణ మృతిచెందాడు. మృతుడు మండపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. యువకుడి తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తికి ఆరునెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్‌షరీన్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం విజయనగరం జిల్లా గుర్ల మండలం గూడెం గ్రామానికి చెందిన కనకం దామోదర్‌రావు గత ఏడాది తూరంగి ప్రాంతంలో ఒక ఇంట్లో సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. సెల్‌ఫోన్ యజమాని దుర్గాడ సురేష్ ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో దామోదర్‌రావుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పాఠాలకు ఆటవిడుపు!

- బడులకు నేటి నుంచి వేసవి సెలవులు
- ఆనందంగా ఇంటిదారి పట్టిన విద్యార్థులు
- జూన్ 12న మళ్లీ ప్రారంభం

రాయవరం: ఏడాది పాటు పుస్తకాలతో..తరగతి గదుల్లో గడిపిన చిన్నారులకు వేసవి సెలవుల రూపంలో ఆటవిడుపు దొరికింది. అటు పుస్తకాలతో కుస్తీలు..ఇటు ఎండ వేడిమి, ఉక్కపోతల నుంచి వీరికి ఉపశమనం లభించింది. చదువుతో పాఠశాలల్లో, హోమ్ వర్క్‌లతో ఇంట్లో బిజీగా ఉండే పిల్లలకు ఒక్కసారిగా తీరిక సమయం దొరికింది. ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ వేసవి సెలవులు ప్రకటించింది. పాఠశాల విడిచిన అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా ఇంటి బాట పట్టారు. సెలవుల్లో ఏం చేయాలో..ఎక్కడెక్కడికి వెళ్లాలో అంచనాలు వేసుకుంటూ, స్నేహితులతో ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ ముందుకు సాగారు.

ఆటల్లో మునిగి తేలనున్న విద్యార్థులు..

ముగిసిన విద్యా సంవత్సరంలో పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇక ఆటపాటల్లో మునిగి తేలనున్నారు. మైదానాలు, పొలంగట్లపైన ఆటలు, నదులు, చెరువులు, కాలువల్లో ఈతలు కొట్టడంలో తలమునకలు కానున్నారు. రోజంతా ఇంచుమించుగా ఉత్సాహంతో గడపనున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమ సామాన్లు సర్దుకొని స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్టాండులకు బయల్దేరారు.

జిల్లాలో

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల కింద 2,036 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 2.02 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికీ నేటి నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు పట్టరాని సంతోషంతో పాఠశాల వద్ద విద్యార్థులు కేరింతలు కొట్టుకుంటూ టాటా..బైబై అనుకుంటూ ఇంటిదారి పట్టడం కన్పించింది. పాఠశాలలకు చివరి పనిదినం కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. పలు పాఠశాలల్లో చివరి పనిదినం రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వీటు, హాట్‌తో పాటు చల్లని పానీయాలు అందజేశారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలిచ్చారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు వేసవి సెలవుల్లో చదువుకునేందుకు విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు సెలవులు ఇచ్చినా ఉపాధ్యాయులు మాత్రం మార్కులు ఆన్‌లైన్ చేయడం, మనబడి నాడు–నేడు పనులు, ప్రమోషన్ జాబితాల తయారీలో నిమగ్నమయ్యారు.



రాయవరంలో సెలవులు ఇచ్చిన ఆనందంతో ఉత్సాహంగా ఇంటి బాట పట్టిన విద్యార్థులు



లైబ్రరీ పుస్తకాలతో మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం విద్యార్థులు

తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

వేసవి సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సైతం నిబంధనలను కచ్చితంగా పాటించాలి. తరగతుల నిర్వహణపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఆయా పాఠశాలల అనుమతుల రద్దుకు చర్యలు చేపడతాం. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

సైనిక సంక్షేమానికి ప్రత్యేక వెబ్‌సైట్

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాజీ సైనికులు సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ రూపొందించామని జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి మజ్జి కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కల్పించే వివిధ పథకాలను ఇక నుంచి వారి నివాస ప్రాంతం నుంచే దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఏపీ.సైనిక్.కామ్ అనే వెబ్‌సైట్‌లో అప్లికేషన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వాలు సైనిక సంక్షేమ శాఖ ద్వారా అందించే ప్రయోజనాలు, గ్రాంట్లు పొందడానికి సర్వీస్ పుస్తకం, ఐడెంటిటీ కార్డు, ఇతర సర్టిఫికెట్లు అప్లోడ్ చేయడం వల్ల దరఖాస్తు చేసిన ప్రతీసారి నకలు కాపీలను జత చేయాల్సిన అవసరం ఉండదని వివరించారు. జిల్లా సైనిక కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునే వ్యక్తులు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించవచ్చన్నారు. అభ్యర్థుల పెన్షన్ వివరాలు, పీపీఓ, ఆధార్, పాన్, ఫ్యామిలీ, ఈసీహెచ్ఎస్, కేంటీన్ వివరాలు కావాల్సి ఉంటుందన్నారు. అప్‌లోడ్ చేయాల్సిన డాక్యుమెంట్లు సర్వీస్‌బుక్, ఆధార్, మాజీ సైనికుని లేదా మాజీ సైనిక వితంతువు ఫొటోగ్రాఫ్, బ్యాంక్ పాస్‌బుక్ లేదా కాన్సిల్ చెక్స్, ఐడెంటిటీ కార్డు, పీపీవో తదితరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని కృష్ణారావు వివరించారు.

వివాహిత దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణం



మణికుమారి (ఫైల్)

అల్లవరం: మండలంలోని రెల్లుగడ్డ గ్రామంలో వివాహిత బొంతు మణికుమారి (35) మంగళవారం మధ్యాహ్నం దారుణ హత్యకు గురైంది. ఇదే గ్రామానికి చెందిన కొంబత్తుల నవీన్‌కుమార్‌తో వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రెల్లుగడ్డలో పనీపాటా లేకుండా జులాయిగా తిరిగే నవీన్‌తో మణికుమారికి కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. మణికుమారి భర్త రామకృష్ణ జీవనోపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. అయితే దుబాయ్‌లో ఉంటున్న భర్త వద్దకు వెళ్లేందుకు మణికుమారి అన్ని ఏర్పాట్లు చేసుకుని వారం రోజుల్లో ప్రయాణానికి సిద్ధమవుతోంది. అయితే మణికుమారి గల్ఫ్ వెళ్లడం నవీన్‌కు ఇష్టం లేదు. ఎలాగైనా ఆపాలనుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మణికుమారి వద్దకు వచ్చాడు. ఇదే ఇంటిలోని పక్క పోర్షన్‌లో ఉంటున్న బొంతు గీతాంజలి కుమారుడు బొంతు మనోజ్, మణికుమారి వద్దకు నవీన్ రావడం చూసేశాడు. ఎలాగైనా మనోజ్ కంట పడకుండా ఉండేందుకు మంకీ క్యాప్ ధరించి నవీన్ బాత్‌రూమ్‌లోకి వెళ్లి దాక్కున్నాడు. ఇది గమనించిన మనోజ్ బయట బాత్‌రూమ్ గడియ పెట్టేశాడు. బాత్‌రూమ్‌లో బందీగా ఉన్న నవీన్‌ను ఇక్కడ నుంచి పంపించేందుకు మణికుమారి గడియ తీసింది. గడియ తీయగానే నవీన్ బాత్‌రూమ్ నుంచి వంటగదిలోకి చొరబడ్డాడు. మంకీ క్యాంప్ ధరించిన వ్యక్తి ఎవరో తెలుసుకునేందుకు మనోజ్ మంకీ క్యాంప్‌ని తీసే ప్రయత్నం చేశాడు. దీంతో నవీన్ ఆగ్రహానికి గురై వంట గదిలో షెడ్డుపై ఉన్న కత్తిని తీసుకుని మనోజ్‌పై దాడి చేయబోయాడు. మనోజ్ తప్పించుకుని పారిపోయాడు. ఇంతలో మణికుమారి తల, నడుము భాగాల్లో విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన మణికుమారి అక్కడికక్కడే మృతి చెందింది. హత్య చేసిన నవీన్ అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వీరబాబు ఎస్సై హరీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులు, మనోజ్ నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్, కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్‌ని రప్పించి దర్యాప్తు చేపట్టారు. ఇదే ఇంట్లో ఏడాదిన్నర క్రితం బొంతు గీతాంజలికి చెందిన బంగారు ఆభరణాలు చోరీ చేసిన కేసులో నవీన్‌పై కేసు నమోదు అయింది. ఈ ఘటనపై ఎస్సై హరీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చోరీ కేసులో నాలుగు నెలల జైలు

ధవళేశ్వరం: చోరీ కేసులో ముద్దాయికి నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని ధవళేశ్వరం సీఐ జీవీ వినయ్‌మోహన్ తెలిపారు. 2023 డిసెంబర్ 24న ధవళేశ్వరం కాటన్‌పేటలో చోరీకి పాల్పడిన తణుకుకు చెందిన చిప్పాడ కేదారేశ్వరరావును పోలీసులు అరెస్ట్ చేసి సొత్తును రికవరీ చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం ముద్దాయికి నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ జడ్జి సి.రమ్య తీర్పు ఇచ్చారన్నారు. ఏపీపీ కె.లక్ష్మీదేవి వాదనలు వినిపించారు.

టీచర్ ఇంట్లో దొంగతనం

- రూ.18 లక్షల విలువైన ఆభరణాల చోరీ
- కేసు నమోదు

యానాం: పట్టణ పరిధిలో కామిశెట్టివారివీధిలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కామిశెట్టివారి వీధిలో నివాసం ఉంటున్న స్థానిక కమలానెహ్రూ ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్న కేఎస్‌లక్ష్మీ నివాసంలో దొంగలు పడి ఇంట్లో ఉన్న రూ.18 లక్షల విలువచేసే బంగారు గొలుసులు తదితరమైన వాటిని తస్కరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితుల వివరాలను తీసుకుని విచారిస్తున్నారు. బాధితురాలి కుమారుడికి ఇటీవలే వివాహం కాగా అమెరికాలో ఉంటున్నారు.

చేబ్రోలులో ఎడ్ల పరుగు పోటీలు



ఎడ్లపందేలు నిర్వహిస్తున్న దృశ్యం



సీనియర్ విభాగంలో గెలుపొందిన కోరా వీర వెంకట సత్యవేణికు బహుమతి అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నాగలోవరాజు, అరిగెల రామయ్య దొర

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారామల కల్యాణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలను నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజేతలకు గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు పులవకాయల నాగలోవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్య దొర బహుమతులను అందజేశారు. సీనియర్ విభాగంలో 11 జతలు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ బహుమతులు గుమ్మిలేరుకు చెందిన కోరా వీర వెంకట సత్యవేణి, జూనియర్స్ విభాగంలో 21 జతలు పాల్గొనగా ప్రథమ బహుమతి గుమ్మిలేరుకు చెందిన కోరా వీర వెంకట సత్యవేణి, ద్వితీయ బహుమతి కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ సాధించారు. న్యాయ నిర్ణేతలుగా చేకూరి రామకృష్ణ, కంటె ఫణికూమార్ వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పడాల ప్రభాకర్, ఇసరపు రామకృష్ణ, నూజివీడు సూర్య, ఆకుల శ్రీను, కడిమిశెట్టి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

- గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న నిందితుడు
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ కిషోర్‌కుమార్

అనపర్తి: మండలంలోని పీరారామచంద్రపురంలో గల ఓ హార్డ్‌వేర్ షాపులో ఒంటరిగా ఉన్న మహిళపై ఐరన్ రాడ్డుతో దాడి చేసి ఆమె మెడలో మంగళసూత్రాల తాడును అపహరించుకుపోయిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను రాజమహేంద్రవరం డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ వెల్లడించారు. హార్డ్‌వేర్ సామాన్లు కావాలంటూ ఈ నెల 2న పీరారామచంద్రపురంలో గల హార్డ్‌వేర్ షాపునకు వచ్చిన నిందితుడు తన వెంట తెచ్చుకున్న ఐరన్ రాడ్డుతో షాపులో ఉన్న మహిళ తలపై బలంగా కొట్టి ఆమె మెడలో బంగారు పుస్తెలతాడును దొంగిలించి బైక్‌పై ఉడాయించాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో, డీఎస్పీ ఆధ్వర్యంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది బృందాలుగా ఏర్పడి జిల్లా ఐటీ కోర్ టీం, క్రైమ్ పార్టీ సిబ్బంది సహకారంతో విచారణ చేపట్టారు. ఈ దర్యాప్తులో నిందితుడు గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నాడన్న సమాచారం తెలియడంతో అతడిపై నిఘా ఉంచారు. ఇదిలావుండగా సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఆపి అతడి వద్ద ఉన్న ట్రావెల్ బ్యాగ్ సిబ్బంది తనిఖీ చేయగా అందులో సుమారు 21 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతడిని విచారించగా అతడు కడియం మండలం జేగురుపాడుకు చెందిన తానంగి క్రాంతికుమార్‌గా గుర్తించారు. పోలీసుల విచారణలో పీరారామచంద్రపురంలో జరిగిన చైన్ స్నాచింగ్‌కు క్రాంతికుమార్ పాల్పడినట్లు గుర్తించారు. గతంలో రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ చేసి జైలుశిక్ష అనుభవించినట్లు, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఏడిద, పోలవరంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడడంతోపాటు అప్పుడప్పుడూ పాడేరు వెళ్లి గంజాయి తెచ్చుకుని రాజమహేంద్రవరం పరిసర గ్రామాల్లో గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. గతంలో గల్ఫ్ దేశం బెహ్రయిన్ వెళ్లిన క్రాంతికుమార్ తిరిగి బెహ్రయిన్ వెళ్లేందుకు నగదు అవసరం కావడంతో నేరాలకు పాల్పడుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి అనపర్తి మండలం పీరారామచంద్రపురం, పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ చేసిన 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 21 కిలోల గంజాయి, బైక్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో హాజరు పరచి జ్యుడీషియల్ కస్టడీకి పంపనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ పి.శివగణేష్, ఎస్సై కె.రామారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కేసు వివరాలను విలేకరులకు వెల్లడిస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

రూ.2.58 కోట్ల బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం



బంగారు, వెండి వస్తువులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రమాదేవి, ఇన్‌స్పెక్టర్ తులసీధర్ తదితరులు

కడియం: తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం పొట్టిలంక సమీపాన జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అధికారులు మంగళవారం రూ.2,58,27,433.71 విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎటువంటి రవాణా అనుమతి పత్రాలూ లేకుండా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి లాజిస్టిక్స్ వాహనంలో తరలిస్తున్న మూడు బాక్సుల్లో వీటిని గుర్తించారు. 4,557.091 కేజీల బంగారం, 1.209 కేజీల వెండి వస్తువులు వీటిలో ఉన్నాయి. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, తహసీల్దార్ రమాదేవి, ఇతర శాఖల అధికారుల సమక్షంలో వివరాలు నమోదు చేసుకుని, సంబంధిత ఉన్నతాధికారులకు ఈ సొత్తును అందజేశారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో రూ.12.20 లక్షల పట్టివేత



సామర్లకోటలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో స్వాధీనం చేసుకున్న నగదు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల వద్ద రూ.50వేలు కంటే ఎక్కువ నగదు ఉంటే దానికి తగిన ఆధారాలు ఉండాలని అధికారులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తీసుకు వెళుతున్నారు. దీనిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ 5 స్థానిక మెహర్ కాంప్లెక్స్ వద్ద ఒక మోటారు సైకిలుపై వెళుతున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా అతని వద్ద రూ.12.20 లక్షల నగదు లభించింది. ఆ నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె.ప్రదీప్‌కుమార్ నగదు స్వాధీనం చేసుకొని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. అయితే స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న బార్‌కు చెందిన సొమ్ము బ్యాంకులో జమ చేయడానికి వెళుతున్నట్లు పంపన మురళీకృష్ణ తెలిపారు. అయితే దానికి సంబంధించిన ఆధారాలను చూపించలేకపోవడంతో నగదు సీజ్ చేసి కాకినాడ ట్రెజరీకి జమ చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.1.33 కోట్లు

రికార్డు స్థాయిలో 28 రోజుల ఆదాయం



సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా గత 28 రోజులకుగాను రికార్డు స్థాయిలో రూ.1,32,78,743 ఆదాయం సమకూరింది. దేవస్థానంలోని హుండీలను మంగళవారం తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ కానుకల్లో నగదు రూ.1,28,88,993 కాగా, చిల్లర నాణేలు రూ.3,89,750 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె. రామచంద్రమోహన్ తెలిపారు. వీటితోబాటు బంగారం 25 గ్రాములు, వెండి 1,180 గ్రాములు వచ్చిందని వారు తెలిపారు. 20 రోజులుగా రత్నగిరి పై జోరుగా వివాహాలు జరుగుతున్నాయి. ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న వారు కూడా పెద్ద సంఖ్యలో సత్యదేవుని ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించారు. వారంతా పెద్ద మొత్తంలో హుండీలలో కానుకలు సమర్పించడంతో రికార్డు స్థాయిలో రోజుకు సరాసరి రూ.4,91,805 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. సత్యదేవుని హుండీల ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీ కూడా లభించింది. అమెరికా డాలర్లు 122, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ దీనార్‌లు 65, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దీనార్లు 175, యూరోలు 35, ఆస్ట్రేలియా డాలర్లు పది, సౌదీ అరేబియా రియల్స్ ఐదు లభించాయి.

ఎన్నికల వేళ అక్రమ రవాణా

12 మంది అరెస్ట్... రూ.2.06 లక్షల నగదు సీజ్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎంత నిఘా పెడుతున్నా అక్రమ మార్కులు మద్యం, నగదు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. జిల్లా ఎస్పీ సునరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ నిఘా బృందాలు దాడులు, తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నాయి. జిల్లాలో సోమ, మంగళవారాల్లో నిఘా బృందాలు నిర్వహించిన దాడులు, తనిఖీల్లో 12 మందిని అరెస్ట్ చేశారు. రూ.2.06 లక్షల నగదు సీజ్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం మంగళవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది.

- ఐ.పోలవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 4 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 2.6 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు.
- ఈతకోట చెక్ పోస్టు వద్ద తనిఖీల్లో రూ.2.06 లక్షలు నగదు సీజ్ చేశారు.
- అమలాపురం, రాజోలు, ఆలమూరు, కొత్తపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం ఎస్ఈబీ స్టేషన్ల పరిధుల్లో దాడులు నిర్వహించి 11 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 127 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 32.73 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.
- పామర్రు పోలీసు స్టేషన్ పరిధిలో కూళ్ల, పాణింగపల్లి, తామరపల్లి, గంగవరం, ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక, రాజవరం గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో కేంద్ర బలగాలు మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహించాయి. స్వేచ్ఛా పోలింగ్ ఓటర్లకు పోలీస్ స్టేషన్ల అధికారులు భరోసా ఇచ్చారు.